# కామెడీ కథ

## లేచిపోదాం రా

**అదరాబదరా నగరం! అర్థం కాలేదా?! అదేనండోయ్! హైదరాబాద్ సిటీ...**

**సదరు భాగ్య నగరానికి నడిబొడ్డున వెలసిన ప్రేమపక్షులతోపాటు అడపా దడపా సినిమా పక్షుల్ని కూడా ఆదుకుంటున్న ఇందిరాపార్కులో జరుగుతున్న ఒకానొక సినిమా షూటింగు.**

పెద్ద థమ్సప్ అడ్వర్టయిజ్‌మెంట్ హోర్డింగ్‌పై అసిస్టెంట్ డైరక్టరు క్లాప్ కొట్టగానే, అలవాట్లో పొరపాటుగా, 'యాక్షన్' అని అరచి వెంటనే నాలుక్కర్చుకున్న డైరెక్టర్ జె.కె.ను చూసి యూనిట్ మొత్తం ఘొల్లుమని నవ్వగా.. అతని మొహం కించిత్ అవమానంతో చిరిగిపోయిన చెల్లని ఐదురూపాయల నోటులా మారిపోయింది..

''మన సినిమాలో నటీనటులే యాక్షన్ చేయడం చేతకాక ఏడుస్తూంటే.. ఇక ప్రాణం లేని హోర్డింగుల్ని యాక్షన్ చేయమంటే ఎలా చేసి చస్తాయయ్యా డైరక్టర్రూ!'' అంటూ డైరక్టర్ జె.కె.కు చురకంటించాడు సదరు సినిమాకి ప్రొడ్యూసరైన సన్యాసి నాయుడు.

ఎలాగోలా షాటు ఓకే చేసి మాడిపోయిన మొహంతో కుర్చీలో కూలబడ్డ డైరక్టరును చూచి.. అంతసేపూ ఆ పక్క కుర్చీల్లో కూర్చుని బాతాఖానీ కొడుతున్న నూతన నటీనటవర్గం వినయంతో లేచి నిల్చున్నారు.

''యాక్షనొచ్చి చావకపోయినా దొంగ వినయానికేం కొదవలేదు ఎదవలకు! కోట్లు ఖర్చుపెట్టి సినిమా తీసి పెడుతున్న ప్రొడ్యూసర్ని ఎవడూ గౌరవించడుగానీ.. ఎవన్నారెదవలు, డైరక్టరును చూసేసరికి ఎక్కళ్లేని వినయాన్ని నటించేత్తున్నారు'' అని సణుక్కుంటున్న ప్రొడ్యూసర్ సన్యాసి నాయుడుతో ''ఈరోజు షూటింగ్‌తో క్లైమాక్స్ తప్ప సినిమా మొత్తం పూర్తయినట్టేనండోయ్ నాయుడుగారూ! పోతే- వెంటనే సినిమాకి మంచి టైటిల్‌ని నిర్ణయించినట్టయితే టీవీ ఛానళ్లలో పబ్లిసిటీ కూడా మొదలెట్టేయచ్చు'' అని నవ్వును నటించేస్తూ అన్నాడు డైరక్టర్ జె.కె.

''ఈ మాటనబట్టి మూణ్నెల్లవుతోందిగానీ సినిమా మటుకు పూర్తవటం లేదు. ఓవైపు ఫైనాన్సియర్లకు చెల్లించాల్సిన వడ్డీ మొత్తం పెరిగిపోతూ బడ్జెట్ తడిసి మోపెడైపోతోంది'' నిష్ఠూరం చేశాడు నాయుడు

''మన సినిమాలో హీరో, హీరోయిన్లతోపాటు అందర్నీ కొత్తమొహాల్నే తీసుకున్నామాయె! వీళ్ళనుండి యాక్షన్ రాబట్టేసరికి ఓ నెల అటూ యిటూ అయ్యిందంతే! ఐనా బెజవాడ రైలెక్కేసి కాస్త ఓపిగ్గా సీట్లో కూచుంటే ఓ గంట అటో యిటో బెజవాడ వచ్చుద్ది కానీ.. రైల్లోని వెనుక పెట్టెలోంచి ముందు పెట్టెల్లోకి పరుగెడితే మాత్రం బెజవాడ స్టేషన్ త్వరగా వచ్చేస్తుందటండీ!'' అన్న జె.కె జోక్‌కి యూనిట్ సభ్యులంతా పగలబడి నవ్వుతూంటే సన్నాసి నాయుడుకి కోపం నషాళానికంటింది.

ఐనా ఓ తెలుగు సినిమా సగటు నిర్మాతగా తన కోపాన్నణచుకోవడం తప్ప ఏం చేయగల్డు పాపం. అందుకే ఆర్టీసీ బస్సొచ్చి ఆటోను ఢీకొన్నా.. లేక ఆటో వెళ్లి ఆర్టీసీ బస్సును ఢీకొన్నా నష్టం ఆటోకే కదా! అన్న అరిగిపోయిన సినిమా డైలాగుతో మనసుకు సర్ది చెప్పుకుని కోపాన్ని దిగమింగుకున్నాడు.

ప్రొడ్యూసర్‌కి కోపం రావడం గమనించిన డైరక్టర్ జె.కె యూనిట్ సభ్యులను తెచ్చిపెట్టుకున్న చిరుకోపంతో మందలించి ''అన్నట్టు అతి త్వరలో క్లైమాక్స్ పూర్తిచేసుకోబోతున్న మన సినిమాకి ఇప్పుడు మనం మాంచి టైటిల్‌ను సెలెక్ట్ చేయబోతున్నాం. మీరెవరైనా మన సినిమాకు తగ్గ చక్కటి టైటిల్‌ను ఆలోచించివుంటే చెప్పేయచ్చు. మాంచి టైటిల్‌ను సూచించినవారికి మాంచి బహుమతి కూడా వుంటుంది'' అన్నాడు, నాయుడు కోపాన్ని తగ్గించాలన్న ఉద్దేశంతో టాపిక్‌ని చేంజ్ చేస్తూ.

టైటిల్ సెలెక్షన్ అనగానే యూనిట్ సభ్యులందరూ తమ ఛైర్స్‌ను డైరక్టరు, ప్రొడ్యూసర్లు కూచున్న సీట్లకు దగ్గరగా లాక్కుని కూర్చున్నారు.

మొదటగా తాను ఆలోచించిన టైటిల్ చెప్పడానికి కామోసు.. కో-డైరెక్టర్ కోణంగిరావ్ గొంతు సవరించుకున్నాడు. ''ప్రస్తుతం సినిమా ఇండస్ట్రీలో టైటిల్ చివర 'రా..' అనే అక్షరంతో విడుదలవుతున్న సినిమాలన్నీ బాక్సాఫీసు బద్దలు కొడుతున్నాయి. ఈ సంవత్సరం ప్రారంభంలో రిలీజైన '...కుందాం..రా!' అన్న సినిమా సూపరు హిట్టవగా, ఆ తర్వాత వచ్చిన 'పూసుకుందాం రా' సినిమా రికార్డు కలెక్షన్లు వసూలు చేసింది గనుక మన సినిమాక్కూడా అదే స్టయిల్లో 'వాయించుకుందాం..రా!' అని టైటిల్ పెట్టేమనుకోండి. సూపర్ డూపర్ హిట్టవడం ఖాయం!'' అని చెప్పుకుపోతున్న కో-డైరెక్టర్ కోణంగిరావ్‌ను అసోసియేట్ డైరెక్టర్ అప్పలకొండ అనకొండలా అడ్డుకున్నాడు.


''అగవయ్యా బాబూ! కథకు సంబంధం లేకుండా వేయించుకుందాం..రా అనో, వాయించుకుందాం..రా అనో టైటిల్ పెడితే ఆడియన్స్ మనల్ని వాయించేత్తారు. అయినా సినిమాకు టైటిల్ పెట్టడమంటే ఆ సినిమా కథనుబట్టి కాస్త టైటిల్ జస్టిఫికేషను కూడా వుండద్దూ!'' అన్నాడు.

''మన సినిమాలో మొదటినుంచి చివరివరకూ హీరోయిన్ అడిగినపుడల్లా హీరో మద్దెల వాయిస్తుంటాడుగదండీ! 'వాయించుకుందాం..రా!' అన్న టైటిల్‌కు ఆమాత్రం జస్టిఫికేషన్ సరిపోదేంటి?!'' అని తన టైటిల్‌ను సమర్థించుకుంటూన్న కోణంగిరావ్‌ను అసిస్టెంట్ డైరెక్టర్ ఆంజనేయులు అడ్డుకున్నాడీసారి.

''రా అనే అక్షరంతో అంతమయ్యే టైటిల్ ట్రెండెప్పుడో వెళ్లిపోయి 'రండి' అనే పదంతో ఎండయ్యే టైటిల్స్ ట్రెండు మొదలయి అపుడే ఆర్నెల్లయిందండోయ్ కోణంగిగారూ! 'ఉతికేసుకుందాం రండి!' నుండి 'ఆరేసుకుందాం రండి' సినిమావరకూ 'రండి'తో అంతమయ్యే టైటిల్ సినిమాలన్నీ ఆడియన్స్‌ను ఆకట్టుకుని తెగ ఆడేస్తున్నాయ్! అందుకే మన సినిమాక్కూడా అదే స్టయిల్లో 'వాటేసుకుందాం రండి' అనో, లేక 'వాడేసుకుందాం రండి' అనో టైటిల్ని పెడితే సక్సెస్ గ్యారంటీ!'' అంటూన్న ఆంజనేయులుకు వినపడకుండా ''ఇలాంటి టైటిల్ పెడితే సినిమా రిలీజయ్యాక ప్రొడ్యూసర్ తన కో-ప్రొడ్యూసర్‌ను నెత్తిన గుడ్డేసుకు పోదాం రండి అని పిలవాల్సొంటుంది'' అని

సణిగేడు హీరో రాంబా ు.

''ప్రస్తుతం అమితా ్ బచ్చన్ 'కౌన్ బనేగా కరోడ్‌పతీ!?' హవా జో ుగా సాగుతోంది గనుక మన సినిమా టైటిల్‌ను కూడా అదే స్టయిల్లో 'కౌన్ బనేగా గీతాపతీ?' అని పెడితే లేటెస్ట్‌గా వుంటుందేమో?!'' సె ండ్ హీరో చిట్టిబాబు కూడా తన ఉచిత సల ాను పడేశాడు టైటిల్ గురించి.



''అవును. మన ( ుయాంగిల్ లవ్ సినిమాలో హీరోయిన్ ( తను ఇద్దరి హీరోల్లో ఎవరు పెళ్లి చేసుకుంట ారన్న విషయం చివరి వరకూ ఉత్కంఠగా సా ఁతుంది గనుక.. చిట్టిబాబుగారు చెప్పిన ట ఁటిల్ మన సినిమాకు చక్కగా కుదురుతుం '' అంటూ చిట్టిబాబును సపోర్ట్ చేసింది డైరెక్టర్ జె.కె పడుచు పెళ్లాం పంకజం ఉరఫ్ ుశీల.

-ఇలా టైటిల్‌గురిం ి జరుగుతున్న డిస్కషన్‌ను బ్రేక్ చేస్తూ తనను ఇంటర్వ్యూ చేయడానికి 'పిన్నీస్ బుక్ ఆఫ్ ర్ల్డ్ రికార్డ్స్' తాలూకు విలేకర్లు రావడాన్ని గ ునించిన డైరెక్టర్ జె.కె మొహం అంబికా దర ుబత్తిలా వెలిగిపోగా, కుర్చీలోంచి ఉన్నపళా లేచి వారికెదురుగా వెళ్లి సాదరంగా ఆహ్వానించా ు.

''ప్రపంచ సినిమా చరిత్రలో అత్యధికసార్లు 'కట్!' అని చెప్పిన ద ర్శకుడిగా మా 'పిన్నీస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్' పుస్తకంలో మీ పేరు ప్రచురించడానికి వీ రు దాఖలాలతోసహా దాఖలు చేసిన పేపర్సును పరిశీలించాక సంతృప్తి చెందిన మా పుస్తకం డ్జీలు అందుకు అంగీకరించి, ఈ సంవత్సరం ప్రపంచవ్యాప్తంగా విడుదల కాబోతున్న మా 'పిన్నీస్ బుక్' ఎడిషన్‌లో మీ పేరును ప్రచురించడానికి నిర్ణయించారన్న శుభవార్తను మీకు తెలియజేసి, మిమ్మల్ని ఇంటర్వ్యూ చేయడానికి వచ్చేం'' అని వాళ్ళలో ఒకడు సినిమా డైలాగులా గడగడా చెప్పగానే ఆనందంతో షాకై శోష వచ్చినంతపనయ్యింది డైరెక్టర్ జె.కె.కు.

ఎలాగోలా తమాయించుకుని వచ్చినవారు కూర్చోడానికి కుర్చీలు వేయించి, కూల్‌డ్రింక్సు తీసుకురమ్మని బాయ్‌ని కేకేశాడు.

కూల్‌డ్రింక్స్ సిప్ చేస్తూ జె.కె.ను ఇంటర్వ్యూ చేయడం ప్రారంభించేరు 'పిన్నీస్ బుక్' విలేకర్లు.

''జె.కె అన్న మీ పొట్టి పేరుకు పొడిగింపేమిటో తెలుసుకోవచ్చా?!'' అడిగాడు ఓ విలేకరి.

ఆ ప్రశ్నకు కాస్త సిగ్గుపడిపోతూ ''దాని వెనుక ఓ చిన్న ఫ్లాష్‌బ్యాక్ వుందిలెండి!''

అంటూ ఓ క్షణం గొంతు సవరించుకుని సదరు ఫ్లాష్‌బ్యాక్‌ను వివరించడం మొదలెట్టేడు జె.కె. ''చాలాకాలం పిల్లలు కలుగలేదని సింహాద్రి అప్పన్నను మొక్కుకున్న మా అమ్మా నాన్నలకు నేమూ, మా అన్నయ్య కవలలుగా జన్మించాం. కవలలుగా పుట్టిన మాకు పేర్లు మ్యాచింగ్‌గా వుండాలని, మా అన్నయ్య పేరు సింగినాథం అనీ, నా పేరేమో జీలకర్ర అనీ, ముద్దుగా పేర్లు పెట్టేరు మా నాన్నగారు. నేను సినిమా ఇండస్ట్రీలో అడుగు పెట్టేవరకూ అందరూ నన్ను 'జీలకర్రా!' అనే పిలిచేవారు. ఆ తర్వాత సింపుల్‌గా వుంటుందని నేనే జె.కె అని మార్చుకున్నా''

''మీ అన్నయ్య సింగినాథంగారు ఏం చేస్తుంటారు?!'' మరో విలేకరి జె.కె.ను ప్రశ్నించాడు.

''అతను కూడా సినిమాలే తీస్తుంటాడు. ఈమధ్యనే వరుసగా అత్యధిక ఫ్లాపు సినిమాలు నిర్మించిన ప్రొడ్యూసర్‌గా 'థింకా బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్' వారిచే సన్మానించబడ్డాడు'' కాల రెగరేసుకుంటూ జవాబిచ్చేడు జె.కె.

''ఇద్దరూ ఇద్దరే మరి!'' అంటూ వ్యంగ్యంగా నవ్వుతున్న అప్పలకొండను ఆ క్షణంలో కలకండలా నమిలేయాలనిపించింది

సాత్విక్

జె.కె.కు. ''ఇంకా మీరు అందిన యితర సత్కారాలేమిటో తెలుసుకోవచ్చా?'' జె.కె.ను అడిగేడు మరో విలేకరి.

''చెప్పుకోవాలంటే కొండంతాండంతవుద్ది నా సన్మాన, సత్కారాల లిస్టు. ఈమధ్యనే అతి తక్కువ సంఖ్య సినిమాలకి అత్యధిక మోతాదు ముడిఫిల్మును ఉపయోగించిన డైరక్టరుగా అంతర్జాతీయ ముడిఫిల్ము ఉత్పత్తిదారుల సంఘంచే వారి ప్రతిష్టాత్మక అవార్డునందుకున్నాను'' గర్వంగా చెప్పుకున్నాడు జె.కె.

''దానికీ, ఇప్పుడీ పిన్నీసు బుక్కు వారు యిస్తున్న అవార్డుకూ తేడా ఏముందో?! రెండూ ఒకటేగా!'' అంటూ గొణిగాడు అసోసియేట్ అప్పలకొండ.

''ఈవిడెవరూ?! ఆ అమ్మాయా?'' అంటూ జె.కె. పక్కనే ఉన్న అతడి పడుచుపెళ్లాంను చూపిస్తూ అడిగేడు ఇంకో విలేకరి.

''యూ సిల్లీ! ఆవిడ నా భార్య సుశీల. 'దాని మొగుడు' సినిమాలో హీరోయిన్‌గా చేసింది. ఆ సినిమా షూటింగ్‌లోనే మేమిద్దరం ప్రేమించుకుని పెళ్లి చేసుకున్నాం'' సిగ్గుపడిపోతూ చెప్పేడు జె.కె.

'నేను ప్రేమించింది నీ దరిద్రపు మొహాన్ని కాదులే, నీ డబ్బును, నవ్వున్న ఈ సినిమా గ్లామర్ ప్రపంచాన్ని చూసి నిన్ను ప్రేమిస్తున్నట్టు నటిస్తున్నానంతే!' అని మనసులో అనుకుంటూ పైకి మాత్రం పకపకలించింది సుశీల, ఉరఫ్ పంకజం, ఉరఫ్ మిసెస్ జీలకర్ర.

మరో పావుగంటపాటు ఇంటర్వ్యూ కొనసాగేక అక్కడినుంచీ నిష్క్రమించారు పిన్నీస్ బుక్ విలేకర్లు.

మరో వారం తర్వాత జరగనున్న క్లైమాక్స్ షెడ్యూలుకు అందరూ హాజరు కావాలని నిర్ణయించాక, ఆ రోజుతో ముగిసిన షెడ్యూల్‌కు పేకప్ చెప్పి విడిపోయారు యూనిట్ సభ్యులంతా.

★ ★ ★

క్లైమాక్స్ షూటింగ్ ఒకే రోజులో ముగియనున్న సింగిల్ డే షూటింగ్ షెడ్యూల్ మొదలయ్యింది. అనేకానేక సినిమా క్లైమాక్స్‌ల్లో రొటీన్‌గా కనిపించే పెళ్లిపందిరి సెట్టే జె.కె ఉరఫ్ జీలకర్ర దర్శకత్వంలో తయారవుతూ ఇంకా పేరు కూడా పెట్టని ఈ సినిమాకూ వేయబడింది.

ఓవైపు షూటింగ్ ప్రారంభించలో యూనిట్ సభ్యులు హడావిడిగా వుంటే, మరోవైపు సెట్టు వేయడానికైన ఖర్చును లెక్క చూసుకుంటూ బావురుమంటున్నాడు ప్రొడ్యూసర్ సన్నాసినాయుడు.

పెళ్లిపందిట్లో ఇద్దరు హీరోలు, ఓ హీరోయిన్ మధ్య జరిగే ఉత్కంఠభరితమైన డ్రామా మధ్య హీరోయిన్ గీతను- హీరోలు రాంబాబు, చిట్టిబాబుల్లో ఎవరు పెళ్లి చేసుకుంటారన్న విషయం తేలడంతో సినిమా ముగుస్తుందని క్లైమాక్స్‌ను యూనిట్ సభ్యులకు వివరిస్తున్నాడు జె.కె.

హీరో హీరోయిన్‌ల కోసం వాకబు చేశాడు అసోసియేట్ అప్పలకొండ. మేకప్ వేసుకుని ఇంకా లాడ్జ్ నుండి సెట్టుకు రాలేదని చెప్పేరెవరో.

''ఈ కొత్త స్టార్లకు మరీ భయం, భక్తీ లేకుండా పోతోంది. మొదటి సినిమా షూటింగ్‌కే ఆలస్యంగా వస్తూ పెద్ద స్టార్లలా పోజు కొడుతున్నారు. అందుకే ఇండస్ట్రీ యిలా అధ్వాన్నంగా తయారవుతోంది'' లెక్చరందుకున్నాడు కో-డైరక్టర్ కోణంగిరావ్.

యూనిట్ బస చేసిన లాడ్జ్‌కు ఫోన్ చేసి హీరో హీరోయిన్లు బయల్దేరారో లేదో కనుక్కోమన్నాడు అసిస్టెంట్ డైరక్టర్ ఆంజనేయులుతో జె.కె.

లాడ్జికి ఫోన్ చేసిన ఆంజనేయులు ''హీరో, హీరోయిన్లు బయల్దేరి చాలాసేపయిందట సార్!'' అని డైరక్టరుతో చెప్పేడు.

అలా ఓ అరగంట గడిచింది. హీరో హీరోయిన్ల జాడ తెలియకపోవడంతో సెట్లో కోలాహలం బయల్దేరింది. కాసేపు అయోమయంతో దిక్కు తోచలేదెవ్వరికీ.

మరో పది నిమిషాలకు ఓ పన్నెండేళ్ళ కుర్రాడు వాచ్‌మన్ చేతికి ఓ కవరిచ్చి దాన్ని అర్జంటుగా డైరక్టరు జె.కె.కు అందజేయమని చెప్పి క్షణంలో అక్కడ్నించి తుర్రుమన్నాడు.

వాచ్‌మన్ సింహాచలం ఇచ్చిన కవరును చించి అందులోని ఉత్తరాన్ని చదవడం మొదలెట్టిన డైరక్టర్ జె.కె ఉరఫ్ జీలకర్రగారి మొహం పీల్చిపోసిన మామిడిపండు టెంకలా తయారయింది.

''గౌరవనీయులైన డైరక్టర్ జె.కె. గారికి మరియూ ప్రొడ్యూసర్ సన్నాసినాయుడుగారికి... తమరు ప్రస్తుతం తీసి వెలగబెడుతున్న సినిమాలో హీరోగిరీలను వెలగబెట్టిన రాంబాబు మరియు చిట్టిబాబులు నమస్కరించి (గుడ్ బై కొడుతూ) వ్రాసుకుంటున్న ఉత్తరాయణం- అయ్యా! గత మూడు నెలలుగా జరిగిన మన సినిమా షూటింగు పుణ్యమా అని మేమిద్దరం మన సినిమా హీరోయిన్ గీతనూ, మరో మాజీ హీరోయిన్ సుశీలను (అంటే డైరక్టరుగారి భార్యకాని భార్య పంకజంను) గాఢంగా ప్రేమించాము. వాళ్ళు కూడా మమ్మల్ని గాఢంగా ప్రేమిస్తున్నట్టు గ్రీన్ సిగ్నలిచ్చారు. మా రెండు జంటలూ ఒకర్నొకరు మర్చిపోలేనంతగా ప్రేమలో మునిగి తేలుతున్నందువల్లా మరియు ఈ రోజుతో మన సినిమా షూటింగ్ టోటల్‌గా ముగియనుండడం వల్ల, ఇక తిరిగి మేం కలుసుకొనే అవకాశాలు తక్కువని నలుగురమూ కలిసి మాట్లాడుకుని, లేచిపోవాలని నిర్ణయించుకున్నాం (క్షమించాలి.. సుశీలగారి ఖాతాలో తమరు జమ చేసిన పదిహేను లక్షల నగదు, ఆమెకు చేయించిన ఐదు లక్షల విలువ చేసే డైమండ్ నగలూ మరియు ఇన్‌కంటాక్సు వారి కళ్లుగప్పి అండర్‌గ్రౌండ్‌లో తమరు దాచివుంచిన ముప్పైలక్షలూ, వెరసి యాభై లక్షల విలువతో సహా లేచిపోతున్నందుకు..) పోతే- మన సినిమా గురించి మీకో ఉచిత సలహా యిస్తున్నాం. దయచేసి పాటించగలరు. మావల్ల సినిమా ఆగిపోవడం మాకిష్టం లేదు గనుక సినిమా క్లైమాక్స్‌ను కూడా హీరో హీరోయిన్లు లేచిపోయినట్టే ముగించి, 'లేచిపోదాం..రా' అన్న టైటిల్‌తో విడుదల చేయగలరు. గుడ్ బై!.. టాలీవుడ్‌లో ఇలా ట్రాజెడీగా విడిపోయిన మనం ప్రాప్తముంటే భవిష్యత్తులో బాలీవుడ్‌లో మేజిక్‌గా కలుసుకోగలమేమో?

-ఇట్లు తమ విధేయులు,

రాంబాబు మరియు చిట్టిబాబు.''

డైరెక్టర్ జె.కె చేతిలోంచి ఉత్తరాన్ని ఆత్రంగా లాక్కొని గబగబా చదివిన ప్రొడ్యూసర్ సన్నాసినాయుడు పెళ్లిపందిరి సెట్లో- పీటల మీది పెళ్లాగిపోయిన పెళ్లికూతురి తండ్రిలా కుప్పకూలిపోయాడు.

*

